డాక్టర్ల రక్షణకు చర్యలు తీసుకోవాలి



వైద్య వృత్తినే పరమావధిగా భావించి ప్రజలకు సేవ చేస్తున్న డాక్టర్ల రక్షణకు ప్రభుత్వం పటిష్ట మైన చర్యలు చేపట్టాలి. కోల్‌కతాలో డాక్టర్‌పై జరిగిన ఘటన అమానుషం . దేశంలో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట మహిళలు, పిల్లలపై ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టడానికి ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను రూపొందించి అమలు చేయాలి.

- డాక్టర్ సురేష్‌బాబు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దువ్వూరు

చట్టాలను కఠినంగా అమలు చేయాలి



మహిళ రక్షణ కోసం ప్రభుత్వం చేసిన చట్టాలను కఠినంగా అమలు చేసినప్పుడే వారిపై అఘాయిత్యాలు జరగకుండా ఉంటాయి. ప్రాణాలను కాపాడే వైద్యులకు, నర్సులకు, సిబ్బందికి రక్షణ లేకుంటే రాత్రి, పగలు వారు ఏవిధంగా విధులు నిర్వహిస్తారు?. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన ఘటన యావత్ దేశాన్నే దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళల రక్షణకు ప్రత్యేక చట్టం చేసి అమలు చేయాలి.

- పి.మంజుల, స్టాఫ్‌నర్స్, దువ్వూరు



మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి



మహిళా ఉద్యోగులకు వారు పని చేసే ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేయాలి. అవి అమలయ్యేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి. మహిళా ఉద్యోగులతో దురుసుగా ప్రవర్తించే వ్యక్తులను గుర్తించి వెంటనే శిక్షించే బలమైన చట్టాలు రావాలి. ఎందుకంటే చిన్న చిన్న నేరాలే పెద్ద నేరాలకు కారణమవుతాయి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల క్రమశిక్షణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ మంజుల, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రాజుపాళెం

వైద్యులపై దాడులు తగదు



ప్రాణాలు కాపాడే వైద్యులకు రక్షణ చాలా అవసరం. కొన్ని చోట్ల డాక్టర్లపై మూకుమ్మడి దాడులు కూడా జరుగుతున్నాయి. అటువంటి వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలి. మరీ మహిళా డాక్టర్లకు రక్షణ లేకుండా పోయింది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ మరణానికి కారణమైన వారిని ఇంకా ఎందుకు శిక్షించలేదు. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఈ సంఘటనను దృష్టిలో పెట్టుకుని మరింత కఠిన శిక్షలు పడేలా చట్టాలు తీసుకురావాలి.

- డాక్టర్ రజనీ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పలుగురాళ్లపల్లె, బి.మఠం మండలం

క్లుప్తంగా

కాలువల్లో పూడికతీత



పూడికతీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలోని ప్రధాన మురికి కాలువల్లో మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి మంగళవారం పూడికతీత పనులు చేయించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలో అడ్డుపడటంతో మురికి నీరు ముందుకు వెళ్లక పోవడంతో దోమల ప్రభావం పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ తమ సిబ్బందితో కాలువలను శుభ్రం చేయించారు.

పోస్టుమాస్టర్‌పై విచారణ



నరసాపురం పోస్టాఫీసు వద్ద గుమికూడిన ఖాతాదారులు

కాశినాయన : మండలంలోని నరసాపురం పోస్టుమాస్టర్ తిరుమలనాయక్‌పై మంగళవారం ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు విచారణ చేపట్టారు. పోస్టాఫీసులో ఖాతాలు కలిగిన ఖాతాదారులు, ఆర్‌డీ చెల్లించే ఖాతాదారుల డబ్బులను సక్రమంగా చెల్లించడం లేదనే ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోస్టాఫీసును మూసివేయడంతో పాటు వచ్చిన ఉత్తరాలను పోస్టాఫీసులోనే ఉంచినట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. పూర్తి విచారణ చేయాల్సి ఉందన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న రాచమల్లు రవిశంకర్‌రెడ్డి

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ నాయకుడు రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మైదుకూరులో మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని దస్తగిరిపేటలో రాచమల్లు రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ వాసుల మధ్య అవినాష్‌రెడ్డి జన్మదిన కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. అనంతరం 300 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాచమల్లు అందరికి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.


ఆరోగ్యం కోసం యోగా చేయండి



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ఆరోగ్యం కోసం రోజూ యోగా చేయాలని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 'ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ' చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చురుకైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించుకొనుటకు ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా చేయాలన్నారు. చిన్న పాటి ఎక్సర్‌సైజ్‌లు చేస్తే రోజూ ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ మధు, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఏఎన్ఎంలు సుజాత, ప్రమీల, యశోద, అరుణ, మేద, మేరి, నాగసుహాసిని, జ్యోతి, సుమలత, నాన్సీరాణి, దీప్తి, గాయత్రి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న బాటిళ్లతో ఎస్ఐ హనుమంతు, పోలీసులు

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లెకు చెందిన డి.శ్రీనివాసులు వద్ద నుంచి మంగళవారం 25 మద్యంబాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. గ్రామాల్లో మద్యం విక్రయించినా, పేకాట ఆడినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



గ్రామోత్సవంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణాలయంలో శ్రీకృష్ణాలయ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. మంగళవారం వేకువజామున వేణుగోపాలస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలు, గజమాలలు, వెండి కవచాలతో సుందరంగా అలంకరించారు. లోక కల్యాణార్థం విశేష పూజాకార్యక్రమాలు, హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నప్రసాద వినియోగం జరిగింది. మధ్యాహ్నం ఉట్టికొట్టు కార్యక్రమం వేడుకగా జరిపారు. సాయంత్రం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం పురవీధుల్లో వైభవంగా నిర్వహించారు. కళాకారుల డూప్‌షో, కోలాటం, డప్పుల వాయిద్యం, చెక్కభజన, బాణసంచా పేలుళ్లు గ్రామోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్, కమిటీ ప్రతినిధులు, యాదవ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ

శ్రీకృష్ణాలయంలో కృష్ణాష్టమి వేడకల్లో ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్‌యాదవ్ పాల్గొన్నారు. ఆయన స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. యాదవ సంఘం నాయకులు పూలమాల వేసి శాలువా కప్పి సత్కరించారు.

గ్రామాభివృద్ధి పేరుతో ఇసుక అమ్మకాలు

- కామనూరు కోసం ఎమ్మెల్యే నిధులు తెచ్చుకోలేరా
- మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : గ్రామాభివృద్ధి కమిటీ పేరుతో కోట్ల రూపాయల ఇసుకను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కుటుంబీకులు అమ్ముకుంటున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఆరోపించారు. స్థానికంగా ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 12,627 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, ఏ పంచాయతీలో ఇలా గ్రామాభివృద్ధి కమిటీలు లేవన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన కామనూరులో మాత్రమే గ్రామాభివృద్ధి పేరు చెప్పి టిప్పర్లు, జేసీబీలు ఏర్పాటు చేసి ఇసుక అమ్ముకుంటున్నారన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ గ్రామాభివృద్ధికి రూ.2–3 కోట్ల నిధులు తెచ్చుకోలేరా అని ప్రశ్నించారు. కలెక్టర్‌ను అడిగితే వెంటనే నిధులు మంజూరు చేయరా అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఏమో ఆర్భాటంగా ఇసుక పాలసీ పేరుతో జీఓ విడుదల చేశారన్నారు. కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎస్పీతోపాటు జిల్లా అధికారులు ఉన్నారన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు మీ పార్టీ నేతలే ఉన్నారని, గ్రామాభివృద్ధికి నిధులు విడుదల చేయించుకోలేరా అని ప్రశ్నించారు. కేవలం గ్రామాభివృద్ధి పేరు చెప్పి 99 శాతం ఇసుకను బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రకారం ప్రొద్దుటూరు మండలంలోని పెన్నానది పరిధిలో ఉన్న కల్లూరు, చౌడూరు, రామేశ్వరం, ఈశ్వర్‌రెడ్డినగర్, పెన్నానగర్, సోములవారిపల్లె, అన్నవరం వాసులు గ్రామాభివృద్ధి పేరుతో ఇసుకను అక్రమంగా తోలుకోవచ్చా అని అడిగారు. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తే మీ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే రెండు మార్లు ఎందుకు పోలీసులు టిప్పర్లను సీజ్ చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయని పక్షంలో గ్రామంలో చందాలు వసూలు చేసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చునని, ఇలా అడ్డదారిన ఇసుక ఎలా తరలిస్తారన్నారు. ఈ విషయంపై తాను గతంలో ప్రశ్నిస్తే కామనూరు సర్పంచ్, మాజీ సర్పంచ్‌లతో ఎమ్మెల్యే ప్రెస్‌మీట్ పెట్టించారన్నారు. కామనూరు అభివృద్ధికి అసలు ఎన్ని రూ.కోట్లు నిధులు అవసరమో బహిర్గతం చేయాలని కోరారు. దౌర్జన్యంగా చలానాలు ఇచ్చి ఇసుక అమ్ముకుంటున్న వ్యవహారం కామనూరులో మాత్రమే ఏళ్ల తరబడి జరుగుతోందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, ఉపసర్పంచ్ మార్తల కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సెల్ సుబ్బయ్య పాల్గొన్నారు.

కార్యవర్గంలో చోటు

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా బైరెడ్డి అంజన్‌రెడ్డిని నియమించారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రమల కిశోర్‌రెడ్డి విజయవాడలో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అంజన్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతానని తెలిపారు.

దుస్తుల పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం దివ్యాంగులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆల్‌ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ కార్యదర్శి ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ అయిమన్ 4వ పుట్టిన రోజు సందర్భంగా పేద దివ్యాంగులకు నూతన దుస్తు లు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు, సుబ్బరాయుడు, కొండమ్మ, యదార్థుడు, డిస్కో రమణ, మెప్మా సీఈఓ విమల పాల్గొన్నారు.

'ఆలయ భూములు అన్యాక్రాంతం కానివ్వం'

మైదుకూరు : మైదుకూరులోని శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి ఆలయానికి చెందిన భూములను అన్యాక్రాంతం కానివ్వబోమని ఆలయ ఈఓ ఎంఎస్ ప్రసాదరావు అన్నారు. మైదుకూరులో 1845/1, 2 సర్వే నంబర్లలోని 10.20 ఎకరాల భూమి కబ్జాకు గురైందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మంగళవారం ఆయన భూమిని పరిశీలించారు. సదరు భూమిలో ఎటువంటి నిర్మాణాలు కానివ్వమని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఈ సందర్భంగా విలేకరులతో ఈఓ ప్రసాదరావు తెలిపారు.

మాతృభాషా దినోత్సవం సందర్భంగా అష్టావధానం

బద్వేలు అర్బన్ : వ్యవహారికభాష ఉద్యమ కర్త, ఆధునిక తెలుగుభాష వ్యాప్తికి తన జీవితాన్ని అంకితం చేసిన గిడుగురామ్మూర్తి పంతులు జయంతి, మాతృభాషా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎన్‌జీవో హోంలో అష్టావధానం నిర్వహించనున్నట్లు తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడపకు చెందిన ప్రముఖ అష్టావధాని మాడుగుల శివశ్రీశర్మచే నిర్వహించే ఈ అష్టావధానంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలి



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి

బద్వేలు అర్బన్ : మానవాళి మనుగడలో చెట్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, ఇలాంటి పరిస్థితులలో ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.గాయత్రిలు తెలిపారు. బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ అసోసియేట్ అధ్యక్షుడు పెద్దిరెడ్డిసతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో వృక్షో రక్షతి రక్షితః కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణంలో సంభవిస్తున్న అనేక రకాల మార్పులకు ముఖ్య కారణం చెట్లు అంతరించి పోతుండమేనని ఇటీవల కాలంలో అధ్యయనాలు తెలుపుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించాలని కోరారు. పట్టణంలో 10 వేల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టిన పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యుల కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిరెడ్డి బ్రహ్మారెడ్డి, బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షుడు హనుమంతరావు, అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, బి.గురుమూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు : తపాలా శాఖ దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ద్వారా అందిస్తున్న ఫిలాటలి స్కాలర్‌షిప్ పథకానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రొద్దుటూరు పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ జి.కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో 6, 7, 8, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థులు 60 శాతం మార్కులు కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. మార్కుల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఫిలాటలి అకౌంట్‌ను ప్రారంభించాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని, మొదటి దశ పరీక్ష ప్రొద్దుటూరు ప్రధాన తపాలా కార్యాలయంలో సెప్టెంబర్ 30న ఫిలాటలి రాతపూర్వక పరీక్ష క్విజ్ ఉంటుందని వివరించారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి రెండో దశలో ఫిలాటలి ప్రాజెక్టు రూపంలో ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6 వేల స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు మీ దగ్గరలోని తపాలా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని వివరించారు.

హిందీ సబ్జెక్టు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు..

స్థానిక ఎస్‌సీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ సబ్జెక్టు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ హిందీ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే ఈనెల 30వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు నేరుగా హాజరు కావచ్చునని పేర్కొన్నారు.

సీపీఎస్, యూపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పోరుమామిళ్ల : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్, యూపీఎస్ వద్దని ఓపీఎస్ మాత్రమే కావాలని ఏపీటీఎఫ్(257) జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, స్టేట్ కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం ఆ సంస్థ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ యూపీఎస్‌లో ఉద్యోగి 30 ఏండ్ల సర్వీస్ అర్హత పొందడం కష్టమన్నారు. 50 శాతం పెన్షన్ పొందే హక్కు కూడా ఉద్యోగులకు రాదన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. 117 జీఓ రద్దు చేయడం వల్ల ప్రాథమిక విద్య బలోపేతం అవుతుందని, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిభట్ల నారాయణదాసుకు ఘన నివాళి



నారాయణదాసు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో మంగళవారం హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ నారాయణదాసు హరికథకు గొప్ప ప్రాధాన్యత తెచ్చిన మహనీయుడు అని కొనియాడారు. కవిత్వం, సంగీతం, నాట్యం మూడు రంగాల్లో తనకున్న ప్రతిభను జోడించి హరికథను అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లారన్నారు. తన హరికథల ద్వారా తెలుగు భాషకు సేవ చేశారన్నారు. కార్యక్రమంలో యడవల్లి రమణయ్య భాగవతార్, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, ఉపాధ్యక్షుడు సాయికుమార్, గంగాధర్, సుధాకర్, రామచంద్రారెడ్డి, నరసయ్య, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటానికి ముందుంటా

- ఘనంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



వృద్ధాశ్రమంలో భోజనం వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రజా సమస్యలపై పోరాటానికి ప్రతిపక్ష నేతగా ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజల తరపున ఎల్లప్పుడూ ముందు వరసలో ఉంటానని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక విశ్వప్రేమ వృద్ధశరణాలయంలో మంగళవారం ఆయన కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు భోజనం పెట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ అవినాష్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో నిండునూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నానన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రతిపక్ష పార్టీ నేతగా ఆయన చేసే పోరాటంలో ఆయన వెన్నంటి నడుస్తానన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతోపాటు చేసే ఉద్యమాల్లో ముందువరసలో నిలుస్తామని తెలిపారు. అధికార పార్టీ నేతగా ఉన్నప్పటికంటే ప్రతిపక్ష పార్టీ నేతగా ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని, ప్రజల హక్కుల కోసం, మౌలిక సదుపాయాల కోసం పోరాడతామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అవిశ్రాంతంగా, అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ రాజారాంరెడ్డి, కౌన్సిలర్లు జిలాన్, సత్యం, గరిశపాటి లక్ష్మీదేవి, పోసా భాస్కర్, చింపిరి అనిల్‌కుమార్, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, పిట్టా బాలాజీ, బొజ్జవారిపల్లె సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీలు గోపాల్, బాషా, వెంకటేష్, ఉపసర్పంచ్‌లు మార్తల కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, వెలవలి రాజశేఖర్‌రెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, ద్వార్సల గురునాథరెడ్డి, మార్కెట్ దాదాపీర్, పాములేటి తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు గ్రామంలో..

ప్రొద్దుటూరు మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి ఈ సందర్భంగా గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, ఆది శేషారెడ్డి, కిరణ్, ఓబుళరెడ్డి, సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్య యాదవ్, ఆవుల రాజా, వేణు తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న చైతన్య సొసైటీ మేనేజర్ సురేష్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు. మహిళా స్త్రీ శక్తి భవన్‌లో మంగళవారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 11 వరకు రెండు నెలల పాటు న్యాకో నేతృత్వంలో మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి, హెచ్ఐవీ చట్టం 2017, టోల్‌ఫ్రీ నంబర్ 1097 గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రూపు మహిళలు, మెప్మా మేనేజర్ కెజియా జాస్మిన్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు విమల, వాణిశ్రీ, నాగలక్ష్మి, శ్రీదేవి, హేమలత, సీఈఆర్‌డీఎస్‌పీయూ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది వంశీ, భాగ్య, ఉమా మహేశ్వరి, సునీత పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులను వాడాలి



మాట్లాడుతున్న ఎఫ్‌టీసీ డీడీఏ రమణారెడ్డి

మైదుకూరు : భూసార పరీక్షలకు అనుగుణంగా రైతులు పంటల సాగులో ఎరువులను వినియోగించాలని కడప రైతు శిక్షణ కేంద్రం డీడీఏ రమణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో జాతీయ గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద విత్తనాలను తీసుకున్న రైతులకు నారుమడులపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు నారుమడులు, వరి నాట్లపై రైతులతో క్షేత్ర సందర్శన నిర్వహించారు. అనంతరం శిక్షణలో రమణారెడ్డి మాట్లాడుతూ వరి నాటే సమయంలో మాత్రమే దుక్కిలో పాస్ఫేట్ ఎరువులను వాడాలన్నారు. పైపాటుగా యూరియా, పొటాష్ ఎరువులను నాటిన 20 రోజుల నుండి వాడాలని సూచించారు. నారు మడిలో ఒక వారం రోజులకు ముందు కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లాలన్నారు. నాట్లను తక్కువ నీటిలో పైపైన వేసి 2 లేదా 4 కుదుర్ల చొప్పున చదరపు మీటరుకు 44 కుదుర్లు ఉండేలా చూడాలని తెలిపారు. నారు కొనలను తుంచి నాటడం వలన కాండం తొలుచు పురుగు అరికట్టవచ్చని అన్నారు. యూరియా, పొటాష్ ఎరువులను తప్పకుండా వాడాలన్నారు. మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి తెలిపారు. విత్తనోత్పత్తి వల్ల రైతులు విత్తనాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా తన సొంత పొలంలోనే రైతులు నేరుగా తయారు చేసుకోవచ్చని తెలిపారు. వనిపెంట కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ వరిలో వచ్చే చీడ పీడల గురించి వివరించి, సలహాలు సూచనలు ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ విత్తనోత్పత్తి పథకం రైతులకు ఎంతో ఉపయోగకరమైందని తెలిపారు. రాబోయే కాలంలో పంటల బీమా, పంట నష్టాలను అధిగమించడానికి ఈ–పంట ఉపయోపగడుతుందన్నారు. కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్రం ఏఓ నాగభూషణ్, వీఏఏలు, వీహెచ్ఏలు ఆర్.బేబీ, ఎస్.దేవిప్రియ, ప్రియాంక పాల్గొన్నారు.

పల్లవోలుకు వచ్చిన తెలంగాణ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న



తెలంగాణ ఎమ్మెల్సీ వెంకన్నతో పల్లవోలు రమణ, స్థానికులు

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు గ్రామానికి చెందిన ఏపీ ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లవోలు రమణ ఇంటికి మంగళవారం సాయంత్రం ప్రజా గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న వచ్చారు. చిత్తూరులో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై, హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో పల్లవోలు రమణ ఇంటికి వచ్చినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. రమణతో గత కొన్నేళ్లుగా ప్రజా నాట్య మండలి ద్వారా పరిచయం ఉందని, తనతో ఉన్న అనుబంధంతోనే పల్లవోలుకు వచ్చి కలసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంకన్నను పల్లవోలు రమణ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

'977/3 సర్వే నంబరులో క్రయవిక్రయాలు జరపరాదు'

గోపవరం : మండలంలోని మడకలవారిపల్లె రెవెన్యూ పొలం 977/3 సర్వే నెంబరులోని 2.34 ఎకరాల భూమిలో ఎలాంటి క్రయవిక్రయాలు జరపరాదని తహసీల్దారు ఉదయభారతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. సదరు సర్వే నెంబరులోని 2.34 ఎకరాలను గతంలో చాటకొండు సుబ్బారావు పట్టా మంజూరు చేయగా సదరు భూమిని నిర్ణీత వ్యవధిలో సాగు చేయనందున ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు 634/2011, 1712/2011 మేరకు పట్టా మంజూరు చేసిన భూమిని రద్దు పరిచినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం ఈ భూమికి సంబంధించి హైకోర్టులో విచారణ జరుగుతున్నందున ఈ సర్వేనెంబరులో ఇంటి స్థలాల కొరకు క్రయవిక్రయాలు జరిపినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లో క్రయవిక్రయాలు జరిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే సదరు స్థలంలో ఎటువంటి కట్టడాలు చేపట్టరాదని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇళ్ల కట్టడాలు నిర్మించి నివాసం ఉన్నట్లైతే వెంటనే ఖాళీ చేసి వెళ్ళాలన్నారు. ఈ స్థలంలో ఎవరూ కూడా ప్రవేశించరాదని, నిబంధనలను ఉల్లంఘించిన యెడల చట్టరీత్యా చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దారు తెలిపారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులకు శిక్ష తప్పదు



మైనర్లకు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ

పోరుమామిళ్ల : మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో మైనర్ బాలురతో, వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. అంతకు ముందు అతివేగంగా బైక్‌లు నడుపుతున్న మైనర్ బాలురను, వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పోరుమామిళ్లలో చేతకాని డ్రైవింగ్‌తో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ, ప్రమాదాలకు మైనర్లు కారణమవుతున్నారని సీఐ, ఎస్ఐ పేర్కొన్నారు. ఇకపై పోరుమామిళ్లలో మైనర్ బాలురు వాహనాలు నడపరాదని, అలా జరిగితే తల్లిదండ్రులదే బాధ్యతగా భావించి చర్య తీసుకుంటామన్నారు.